# వ్రతం అయింది కానీ...

( బహుమతి పొందిన కథ )



"అబ్బబ్బబ్బ... ఈ ముండాకొడుకుతో చావొచ్చిపడింది!" అంటూ రుసరుసలాడుతూ వచ్చాడు సుబ్బారావు.

"ఎవరా ముండాకొడుకు.., ఏమా కథ?" అడిగాడు మూర్తి ముసిముసి నవ్వులు నవ్వుతూ.

"ఒరేయి... సమయం, సందర్భం లేకుండా వెధవ జోకులు విసరకు! నాకసలే వళ్ళు మండిపోతోంది!" అన్నాడు సుబ్బారావు కోపంగా.

"అయ్యోపాపం..! దగ్గర్లో నీళ్ళుకూడా లేవ్!" అని మరో జోక్ వేశాడు మూర్తి.

"సంతోషించాంలే... తెలివితేటలకి కాని, ఈపాటికి చాలించు!" అన్నాడు సుబ్బారావు కుర్చీలో కూర్చుని తల పట్టుకుంటూ.

"అసలు ఏం జరిగిందో చెప్పరా..! మిరపకాయలు మింగిన కాకిలాగ ఎందుకలా అరుస్తున్నావు!" అన్నాడు మూర్తి.

"వాడేరా... మన ఆఫీసర్! క్యాజువల్ లీవు ఇమ్మంటే చాలు- అష్టోత్తరం చదువుతాడు. ఎప్పుడు అడిగినా సరే- 'లేదు' అనే మాట రామనామంలాగా జపిస్తాడు. ఇతరుల అవసరం ఏమాత్రం చూడడు" అన్నాడు సుబ్బారావు చిరాగ్గా.

"అదేమిటిరా- ఆఫీసులో చేతులన్నీ పూర్తిగా ఉన్నాయిగా!?"

"చేతులేమిట్రా- నీ శ్రాద్ధం..!?"

"అదేరా... ఆఫీసులో హాండ్స్ ఫుల్‌గా ఉన్నారుగా!"

"ఏమి..? ఉంటే యేం..! మనం లేకపోతే ఆఫీసు కప్పు కూలి అందరి నెత్తినా పడేట్లు మాట్లాడుతాడు."

"అసలు ఏం జరిగిందో సరిగ్గా చెప్పరా!"

"అదే చెప్పబోతున్నాను. అసలు వాడి గదిలోకి వెళ్లడమంటేనే తలనొప్పి! భల్లూకంలాగా కూర్చుంటాడు. నమస్కారం పెట్టినా తలైనా ఎత్తడు. నిద్రపోతున్నాడో తెలియదు, జోగుతున్నాడో తెలియదు. అసలు మనం పెట్టిన నమస్కారమైనా చూశాడో, లేదో తెలియదు!" అంటూ ఒక్కబిగిన చెప్పుకుపోసాగాడు సుబ్బారావు.

"ఒరేయ్... నువ్వు చెప్పింది పాయింటే రోయ్! వాడికి తన క్రింద ఉద్యోగులు నమస్కారం పెట్టలేదనుకుంటే భలే కోపం వస్తుంది. అది మనసులో పెట్టుకుంటాడు కూడాను..!" అన్నాడు మూర్తి సుబ్బారావు వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేస్తూ.

"దిక్కుమాలిన గోల! వాడి మెల్లకన్ను కాదు కాని, అసలు మన నమస్కారం గమనించిన విషయం కూడా తెలీదు. చూడలేదేమోనని మళ్లీమళ్లీ పెట్దామనుకుంటే తన మెల్లకన్నుని హేళన చేస్తున్నాడని అనుకుంటాడని భయం! వీడితో భలే చావొచ్చి పడిందిరా బాబూ..!" అన్నాడు సుబ్బారావు దిగులుగా.

"అదీ నిజమేరోయ్! ఆ... ఉండు- నేనో ఉపాయం చెప్తాను..." అన్నాడు మూర్తి.

"ఏమిట్రా అది?" అన్నాడు సుబ్బారావు ఆసక్తితో.

"వాడు మెల్లకన్నుతో ఎటు చూస్తున్నాడో తెలీదుకదా! అందువల్ల ఇక ముందు నమస్కారం పెట్టేటప్పుడు చేతులు జోడించి ఆయన చుట్టూ ఒక ప్రదక్షిణం చేయి. ఏదో

ఒక దశలో వాడి కంటికి నీ నమస్కారం కనిపిస్తుంది!" అంటూ వస్తూన్న నవ్వును ఆపుకుంటూ అన్నాడు మూర్తి.

"ఊ... ఇదా నువ్వు చెప్పేది! నా సీరియస్‌నెస్ అంతా తగ్గించేవు కదా..! అయితే అయిందికానీ, భలే బాగా చెప్పావు!" అంటూ పకపకా నవ్వసాగాడు సుబ్బారావు.

"ఇంతకీ- నువ్వెందుకు సి.యల్. అప్లై చేశావురా?" అన్నాడు మూర్తి.

"ఒరేయ్... నీకు తెలీనిదేముంది? పెళ్ళయి గట్టిగా మూడు నెలలు కాలేదు కదా- 'మూఢం... మూఢం' అంటూ మూఢుఢు మా మామగారు వారం తిరక్కుండా మా ఆవిడని పుట్టింటికి తోలుకుపోయాడు. పోనీ సరదాగా ఓ మూడు రోజులు అత్తవారింటికి వెళ్లివద్దామనుకుంటే... ఈ ముండా కొడుకు సెలవు ఇవ్వనంటాడు!" సుబ్బారావు ఎంతో బాధగా వాపోయాడు.

"ఒరేయి... నీభార్య ఆవా? గేదా?... తోలుకుపోడానికి?" అని అడుగుదామను కున్నాడు కాని, అసలే సుబ్బారావు బాధ పడుతున్నాడని ఊరుకున్నాడు మూర్తి.

"సరదా నీకు కాని.., ఆ నవాబుదేముందిరా?" అన్నాడు.

"నవాబుట?! ఆ నవాబుతనం వాడి పేరులోనే కాని, బుద్ధిలో ఏమాత్రం లేదు. ఆఫీసర్ అవగానే సరిపోయిందా? ఆ హుందాతనం చేతల్లో ఉండొద్దూ? ఇటువంటి వాళ్ళని చూసే 'కనకపు సింహాసనమున' అనే పాట కట్టాడు వేమన..!" అన్నాడు సుబ్బారావు కసిగా.

"ఒరేయ్... ఒరేయి! ఖూనీ... ఖూనీ!" అని అరిచాడు మూర్తి.

"ఎక్కడ... ఎక్కడ?" అంటూ కంగారుగా లేచాడు సుబ్బారావు.

"ఇంకెక్కడ..? నువ్వే ఆ హంతకుడివి! 'కనకపు సింహాసనమున' అనేది పాట కాదురా నాయనా- అది పద్యం! దానిని చెప్పింది సుమతీ శతకకారుడు. వేమనగారు కనుక బ్రతికి వుంటే నీ మాట విని నిలువునా ఉరి వేసుకునేవాడు!" అన్నాడు మూర్తి.

"అబ్బ- పోరా! ఎంత కంగారుపెట్టావు? బోడి హాస్యమూ నువ్వూనూ..! ఇల్లుకాలి ఒకడేడుస్తుంటే ఒళ్ళుకాలి ఇంకొకడు ఏడ్చాడుట. చెప్పేదేదో చెప్పనివ్వకుండా పానకంలో పుడకలాగా అడ్డు వస్తే ఎలా..?" అన్నాడు సుబ్బారావు కోపంగా.

"సరే... చెప్పు నాయనా! ఇంతకీ సి.యల్.కి కారణం ఏమని పెట్టావు? సరదాగా అత్తవారింటికి వెళ్తాననేనా?"

"ఛ... నేనేనా అంత తెలివితక్కువ వాణ్ణి? ఓసారి తేలుకుట్టిందని సెలవు చీటీ పంపిస్తే ఆఫీస్‌కి పిలిపించి కుట్టిన చోటుని పరీక్షించి, కుట్టిందని నమ్మకం కలిగాకనే అర్ధదినం సెలవు గ్రాంటు చేసిన కర్కోటకుడు ఈ నవాబు. వీడి సంగతి తెలిసే గుండుసూదితో వేలిమీద

పొడుచుకుని దానికింత మందు రాసి, తేలు కుట్టినట్టు చూపించాను. అటువంటి వీడికి నిజం తెలిస్తే సి. యల్. గ్రాంటు చేస్తాడా?" అన్నాడు సుబ్బారావు.

"మరి... కారణం ఏమని చూపించావ్?"

"ఎవ్వరూ 'నో' అనడానికి వీలులేని కారణం చూపించానురా."

"ఏమిట్రా అది?"

"శోభనమని వ్రాశానురా..!"

"వెరీగుడ్... నీ బుర్ర అమోఘంరా! ఇంక 'నో' అనడానికి వీలులేదే..!"

"గాడిదకొడుకు బుర్ర- మనకంటే అమోఘంరా..! పెళ్ళయి మూడునెలలు అయితే ఇప్పుడు శోభనం ఏమిటని నిగ్గదీశాడు."

"చంపాడురా..! ఎంతైనా- వాడు ఉద్దండ పిండం!"

"అయ్యా..! మాలో శోభనం పెళ్ళయిన వెంటనే చెయ్యరు. ఇంతలో మూఢం అడ్డొచ్చింది. అందువల్ల మా మామగారు ఇప్పుడు ఏర్పాటుచేశారు... అని నచ్చచెప్ప ప్రయత్నించాను."

"అంటే ఏమంటాడు?"

"అనుమానంగా నా వంక ఎగాదిగా చూసి ఇప్పుడు సెలవు ఇయ్యడానికి వీలులేదు. ఇంకోసారి ఏర్పాటు చేయమని మీ మామ గారికి వ్రాసేయి... అన్నాడురా."

"ఆ..! అంత మాట అన్నాడూ..?!"

"అవునురా... అది కాదని నచ్చచెప్దామని ఎంత ప్రయత్నించినా, ఆఖరికి నోటితో మాట్లాడడం కూడా మానేసి చేతి సంజ్ఞలతోనే బయటకు పొమ్మన్నాడురా... వీడి మొహం మండా..!" అన్నాడు సుబ్బారావ్ ఆక్రోశం పట్టలేక.

"ఒరేయ్... నిన్ను చూస్తే జాలేస్తోందిరా. అయినా నవాబు సంగతి తెలిసే నువ్వు ఇట్లా మాట్లాడితే ఎట్లారా?"

ప్రశ్నార్థకంగా చూశాడు సుబ్బారావు.

"అవునురా..! ఈ ఆఫీసులో నవాబు చాలామందికి సెలవు ఇస్తూనే ఉన్నాడు కదా... వాళ్ళకి ఎలా ఇస్తున్నాడంటావ్?"

"అది వాళ్ళ పుణ్యం! ఇది నేను చేసుకున్న పాపం..!"

"కాదురా అబ్బీ... ఈ సాయంత్రం ఆ చిదంబర రహస్యమేదో నీ కళ్ళారా చూపిస్తా. నువ్వూ అలా చేయి... నీ కోరిక నెరవేరుతుంది!"

"అదేమిటో తొందరగా చెప్పరా..!"

"కంగారుపడకు నాయనా... శాంతమే భూషణమన్నారు!"

"పదరా... ఒక అరకప్పు కాఫీ వేసి వద్దాం. అసలే తల నొప్పిగా ఉంది."

"పద పద... ఏ పాటు తప్పినా సాపాటు తప్పదుగా!"

సుబ్బారావు, మూర్తి నవ్వుకుంటూ బయటకు వెళ్లారు.

* * *

సాయంత్రం 6-30 అయింది.

వచ్చేది శీతాకాలమేమో... అప్పుడే చీకటి పడింది. నవాబు క్వార్టరు కూడా ఆఫీసు కాంపౌండులోనే ఉంది.

మూర్తి, సుబ్బారావు నవాబు ఇంటిముందున్న చెట్టుచాటున చేరారు. కొంచెంసేపట్లో వాళ్ళ క్లర్కు అమానుల్లా వచ్చాడు.

చేతిలో ఒక బుట్ట పుచ్చుకొని "సాబ్- సాబ్..." అంటూ రెండుసార్లు పిలిచాడు.

"కౌన్ హై..?" అంటూ ఒక పన్నెండేళ్ళ బాలుడు బయటకి వచ్చాడు.

అమానుల్లా బుట్టలోంచి దేనినో బయటకి తీశాడు. అందులోంచి 'కొక్కొరోకో...' అంటూ ఒక కోడి బయటకి వచ్చింది. దాని మెడలో నాలుగు మడతలు వేసిన కాగితం ఒకటి వేలాడుతోంది.

ఆ పిల్లవాడు ఏమీ మాట్లాడకుండానే ఆ కోడిని తీసుకుని లోనికి వెళ్లిపోయాడు. మరో రెండు నిమిషాల్లో కోడి మెడలోనున్న కాగితం తీసుకొచ్చి అందించాడు.

ఆ కాగితం తెరచి చూచి "షుక్రియా..!" అంటూ వెళ్లిపోయాడు అమానుల్లా.

"చూశావా... కోడి, వంటఇంట్లోకి గ్రాంటయిన సి. యల్. అప్లికేషన్!" బయటకి అన్నాడు మూర్తి.

"ఇంత దారుణమా? అయితే ఈ విషయం నీకెలా తెలుసు?"

"అమానుల్లా ప్రొద్దున చెప్పాడు- రేపటినుంచి సి. యల్. పెట్టి పోతున్నట్లు! అంత ధీమాగా చెప్పాడంటే ఇటువంటిదేదో ఉంటుందని నాకు తెలుసు. నువ్వు కూడా అలాగే చేయి..."

సుబ్బారావు అదిరిపడ్డాడు.

"శివ శివ..! శుద్ధ శాకాహారిని- నేను నిష్కారణంగా కోడి ప్రాణం తీయిస్తానా?" అన్నాడు.

"కోడినే ఇమ్మని ఎవరు చెప్పారురా..? కోడి.., లేకపోతే పకోడి! అదీ కాకపోతే నన్నడుగు..!" గీతోపదేశం చేసే శ్రీకృష్ణ భగవానుడిలా ఫోజిచ్చి చెప్పాడు మూర్తి.

వెంటనే ప్రక్కనేవున్న షాపుకి వెళ్లి పెద్దపెద్ద చక్రకేళీ అరటిపళ్ళు కొనుక్కొచ్చి, అందులో అప్లికేషన్ పెట్టి, అక్షరాలా అమానుల్లా చేసినట్లు, మూర్తి చెప్పినట్లు చేశాడు సుబ్బారావు.

మరునిముషంలో సెలవు మంజూరై వచ్చింది. ఆనందం పట్టలేక మూర్తిని గట్టిగా కౌగిలించుకుని ముద్దాడినంత పనిచేశాడు సుబ్బారావు.

ఆరాత్రే ఉషారుగా అత్తవారి ఊరికి బయలుదేరాడు. దారిపొడుగునా తన ప్రియురాలిని తల్చుకుంటూ ప్రయాణం చేశాడు.

నాలుగోరోజున ఆఫీసుకు తిరిగి వచ్చాడు సుబ్బారావు.

వాడి ఏడుపు ముఖం చూస్తే ఏమి జరిగిందోనని గుండె గుభేలుమంది మూర్తికి.


"ఏమయిందిరా- అలా ఉన్నావు?" అని అడిగాడు.

"ఏం చెప్పను బ్రదర్! నాకు లక్ లేదు. వ్రతం జరిగినా ఫలితం లేనట్లు.., నే వెళ్లిన ఆ మూడు రోజులూ మా ఆవిడ దూరం జేరింది!" అన్నాడు తలపట్టుకుంటూ.., కన్నీళ్ల ఒక్కటే తక్కువ.

"అరెరే.., వెరీ బాడ్‌లక్! ఏంచేస్తాం చెప్పు... గుడ్‌లక్ నెక్స్ట్‌టైమ్!" అన్నాడు మూర్తి.

అంతకన్నా ఇంకేమనాలో తోచక మౌనంగా ఉండిపోయాడు సుబ్బారావు.

– విశ్వ రచన పక్ష పత్రిక... *1 జూన్ ' 75*



వైద్యం

సుబ్బారావు : అబ్బా... ఈ పన్నుపోటు భరించలేకపోతున్నాను. వెంటనే డెంటిస్టు దగ్గరికి వెళ్లాలి.

రాజారావు : శుద్ధ దండగ. నిన్న నాకూ ఇలాగే పన్నుపోటు వచ్చింది. వెంటనే నేను ఇంటికి పోయి మా ఆవిడతో శృంగారం జరిపాను. అంతే... పన్నుపోటు మాటే మర్చిపోయాను.

సుబ్బారావు : బ్రహ్మాండంగా ఉంది. అయితే వెంటనే మీ ఇంటికి వెళ్లి నేను వస్తున్నానని, సిద్ధంగా ఉండమని మీ ఆవిడకి చెప్పు.